# యువత... అందుకున్నారు భవిత





రావులపాలేనికి చెందిన అరిశెట్టి చైతన్య బీటెక్ పూర్తి చేశాడు. కౌశల్ గోదావరి-వికాస నిర్వహించిన జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగం పొందాడు. ప్రస్తుతం బ్రిటానియా కంపెనీలో ఏరియా సేల్స్ మేనేజరుగా ఎంపికై బెంగళూరులో పనిచేస్తున్నాడు. ఇతడికి ఏడాదికి రూ.4.20 లక్షల వేతనం చెల్లిస్తున్నారు.



కాకినాడకు చెందిన పి.ప్రత్యూష బీటెక్ పూర్తి చేశారు. ఈమె ఉద్యోగం కోసం అన్వేషిస్తూ కౌశల్ గోదావరి - వికాస ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో పాల్గొని ఐబీఎం కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఎంపికయ్యారు. ఈమెకు నెలకు రూ.18 వేలు వేతనం చెల్లిస్తున్నారు. ప్రస్తుతం బెంగళూరులో పనిచేస్తున్నారు.

✦ జిల్లాలో నాలుగేళ్లలో 48,207 మందికి ఉద్యోగాల కల్పన

✦ నైపుణ్య శిక్షణతో మెరుగైన అవకాశాలు

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

నైపుణ్య శిక్షణతో ప్రతిభ వికసిస్తోంది... కౌశల్ గోదావరితో అవకాశాలు అందిపుచ్చుకుంటున్నారు... స్వయం ఉపాధి పొందుతున్నవారు సైతం తాము ఎంచుకున్న రంగాల్లో మరింత చురుగ్గా రాణించేలా శిక్షణ పొందుతున్నారు. నవ్యాంధ్రలో నాలుగేళ్ల సమయంలో జిల్లా యువత నైపుణ్యాభివృద్ధిరస్తు... ఉపాధి సిద్ధిరస్తు అంటూ దీవెనలు అందుకుని ముందుకు సాగుతోంది. నవ్యాంధ్రలో ఈ నాలుగేళ్ల కాలంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా జిల్లాలో అనేక కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహించింది. యువతకు శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పించింది. ఉద్యోగ మేళాలు ద్వారా వేల మందికి పలు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించారు. గూగుల్, టీసీఎస్, హెచ్‌సీఎల్, టెక్ మహీంద్ర, ఐబీఎం, జెన్‌పేక్ట్స్, హెటిరో, మిరాకిల్ సాఫ్ట్‌వేర్, రెడ్డీస్ ల్యాబ్స్, టీటీసీ వంటి ప్రముఖ కంపెనీల్లో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించారు.

### ఈ నాలుగేళ్లలో...

✦ 2018-19 సంవత్సరానికి గాను ఉద్యోగ క్యాలెండర్‌ను రూపొందించారు. కౌశల్ గోదావరి-వికాస ద్వారా 25 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించటానికి ఏర్పాట్లు చేశారు.




జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ఉద్యోగ మేళాలు **60**

స్వయం ఉపాధిలో మరింత రాణించేలా శిక్షణ పొందినవారు **5,000**

ప్రముఖ కంపెనీల్లో కల్పించిన ఉద్యోగాలు **48,207**

డీఆర్‌డీఏ ద్వారా వివిధ అంశాల్లో శిక్షణ పొందినవారు **2,732**



ఉద్యోగ మేళాలో ఎంపికైన యువతను బస్సులో పంపుతున్న ఉపముఖ్యమంత్రి చినరాజప్ప తదితరులు(దాచిన చిత్రం)

### కౌశల్ గోదావరి పరవళ్లు

సీఎం చంద్రబాబు పదవీ బాధ్యతలు చేపట్టిన పుట్టునుంచి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పనే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించారు. దీనిలో భాగంగా కలెక్టరేట్ కేంద్రం వికాస సంస్థ ద్వారా యువతకు శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పించారు. కలెక్టర్ కార్తికేయ మిశ్రా వచ్చిన తరువాత వికాస సంస్థను కౌశల్ గోదావరి ప్రాజెక్టుగా మార్చారు. దీని ద్వారా పెద్ద సంఖ్యలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఉద్యోగ మేళాలు చేపట్టారు. ప్రతీ నియోజకవర్గంలో రెండు, మూడు మెగా ఉద్యోగ మేళాలు ఏర్పాటు చేయడం ద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కల్పించ గలిగారు.

### శిక్షణ... నైపుణ్య రక్షణ

కౌశల్ గోదావరి-వికాస ద్వారా ఇప్పటి వరకు తొమ్మిది వేల మందికి శిక్షణ ఇచ్చారు. భావవ్యక్తీకరణ నైపుణ్యం, డేటా ఎంట్రీ, ఫార్మా, మొబైల్ టెక్నాలజీ, ఎలక్ట్రీషియన్, బ్యూటీషియన్, క్లౌడ్ టెక్నాలజీ, నెట్ బ్యాంకింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇచ్చారు. 2018-19 సంవత్సరానికి గాను వివిధ కోర్సుల్లో శిక్షణకు ఏర్పాట్లు చేశారు.

### స్వయం ఉపాధికి మెరుగులు

కలెక్టర్ కార్తికేయ మిశ్రా చొరవతో ఎస్సీ, బీసీ, మైనారిటీ, కాపు కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలు పొంది, స్వయం ఉపాధి యూనిట్లు నిర్వహిస్తున్న వారికి ఆధునిక టెక్నాలజీతో వీటి నిర్వహణకు గాను శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్వయం ఉపాధి యూనిట్ రాయితీపై పొందిన శిక్షణ ద్వారా మరింత ప్రావీణ్యం సంపాదించేలా ఈ శిక్షణ కొనసాగింది.



రాజమహేంద్రవరంలో నిర్వహించిన జాబ్ మేళాకు హాజరైన జనం(దాచిన చిత్రం)

### 1,850 మందికి అవకాశాలు

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దీనదయాళ్ గ్రామీణ కౌశల్ యోజన పథకం(డీడీయూజీకేవై) సౌజన్యంతో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతకు గత నాలుగేళ్లలో శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని అయిదు కేంద్రాలు ద్వారా 8వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన విద్యార్థులకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పించారు. 2014-2018 మధ్య పలువురికి శిక్షణ ఇచ్చి 1,850 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ప్రస్తుతం అయిదు కేంద్రాల్లో 225 మంది వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్నారు.

### సెట్రాజ్ ఆధ్వర్యంలో ఉపాధి

**సర్పవరం జంక్షన్:** జిల్లా యువజన సర్వీసుల శాఖ, సెట్రాజ్ ఆధ్వర్యంలో యువతకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిస్తున్నారు. యువజన మార్పిడి కార్యక్రమంలో భాగంగా ఏటా జిల్లా నుంచి యువతను ఎంపిక చేసి ఇతర జిల్లాలకు పంపి, అక్కడి సంస్కృతీ సాంప్రదాయాలు, ఆచారాలు, అలవాట్లు తెలుసుకునేలా చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలను సమర్థంగా ఎదుర్కొనేలా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జిల్లాలోని 1,200 మంది యువతకు శిక్షణ ఇప్పించారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలకు వెళ్లే యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ముందస్తు గురుకుల శిక్షణనిచ్చి, ఉద్యోగాలు పొందేలా చేస్తున్నారు. యువతలోని ధైర్యసాహసాలు, క్రమశిక్షణను పెంచేందుకు ఎవరెస్టు, కిలిమంజారో పర్వతారోహణ చేసేందుకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ నాలుగేళ్లుగా ప్రోత్సహిస్తున్నారు. గ్రామస్థాయిలో యువజన సంఘాలను ప్రోత్సహించడంతో పాటు వారిలో క్రీడానైపుణ్యాలను పెంపొందించేందుకు ఒక్కొక్క సంఘానికి రూ.15 వేల విలువైన క్రీడాసామగ్రిని, నియోజకవర్గంలో 20 సంఘాలకు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.